సాక్షి విశాఖపట్నం

బుధవారం । 29 । జనవరి । 2025



మెరుపై సాగుతూ..

చదువులోనే కాదు.. క్రీడల్లో కూడా రాణించాలన్న వారి పట్టుదల ముందు రన్నింగ్ ట్రాక్ చిన్నబోయింది. కాళ్లకు షూ లేకపోయినా.. చిన్న చిన్న రాళ్లు గుచ్చుకుంటున్నా.. పరుగు లక్ష్యం ఆపలేదు. వీరి పట్టుదల చూసిన వారంతా కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా మంగళవారం రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో కొంతమంది విద్యార్థుల కాళ్లకు షూ లేనప్పటికీ.. పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. – ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



స్వర్ణశోభితం.. అతిథి విన్యాసం

సాయం సంధ్యా సమయంలో స్వర్ణశోభితంగా వినీలాకాశం వెలిగిపోతుంటే.. వలస పక్షులు సందడి చేశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు విహరించిన కొంగలు సూర్యాస్తమయ సమయంలో కాపులుప్పాడ ప్రాంతంలో చెట్లపైకి చేరుకున్నాయి. ఈ విశిష్ట అతిథులను చూసి స్థానికులు మురిసిపోయారు. కనువిందు చేసిన ఈ సుందర దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



తండేల్ కలెక్షన్లు దుల్లగొట్టేయాలి

- హీరో నాగచైతన్య
- రామాటాకీస్‌లో ట్రైలర్ లాంచ్
- పాల్గొన్న అల్లు అరవింద్, దర్శకుడు చందూ మొండేటి

8లో

నేడే అప్పన్న తెప్పోత్సవం

- విజయవంతంగా ట్రయల్‌రన్
- ముస్తాబైన వరాహ పుష్కరిణి

సింహాచలం: పుష్య బహుళ అమావాస్య సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం(నౌకావిహారం) బుధవారం సాయంత్రం వరాహ పుష్కరిణిలో జరగనుంది. హంసాకారంలో రూపొందించిన తెప్పపై స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా నౌకా విహారం చేయనున్నారు. ఈ మేరకు విశాఖ ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ట్రయల్‌రన్ నిర్వహించారు. తెప్ప తీర్చిదిద్దిన తీరు, సామర్థ్యాన్ని పరిశీలించారు. ట్రయల్ రన్‌లో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈ తాతాజీ పాల్గొన్నారు.

విశేషంగా ఏర్పాట్లు

తెప్పోత్సవ ఏర్పాట్లను దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. హంసాకార తెప్పను పూలు, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. పుష్కరిణి నలువైపులా విద్యుద్దీపకాంతులు ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణి మధ్యలో స్వామి పూజలందుకునే మండపాన్ని తీర్చిదిద్దారు. పుష్కరిణి గట్టుపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణి వద్ద 15 మంది గజ ఈతగాళ్లను, రెండు అదనపు బోట్లను, 15 లైఫ్ జాకెట్లను అందుబాటులో ఉంచనున్నట్లు ఆలయ ఈఈ రాంబాబు తెలిపారు. 35 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు తెలిపారు.



వరాహ పుష్కరిణిలో సిద్ధం చేసిన హంసాకార తెప్పపై ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఎఫ్‌డీవో, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు

వేణుగోపాల స్వామి అలంకరణలో..

తెప్పోత్సవంలో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వేణుగోపాలస్వామి అలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా మెట్లమార్గంలో తీసుకొస్తారు. పుష్కరిణి వద్ద హంస వాహనంపై స్వామిని వేంజేపచేసి సాయంత్రం 5 గంటల నుంచి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం స్వామిని మండపంలో కొలువుంచి షోడశోపచార పూజలు నిర్వహిస్తారు. పుష్కరిణి సత్రం వద్దకు చేర్చి, సర్వజనమనోరంజని వాహనంపై రాత్రి అడవివరం గ్రామంలో తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం స్వామిని తిరిగి సింహగిరికి చేరుస్తారు.

విమానాశ్రయంలో మాక్ డ్రిల్ నేడు

మహారాణిపేట: విశాఖ విమానాశ్రయంలో బుధవారం మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తలెత్తే ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఈ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్టు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. మంగళవారం విమానాశ్రయంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ముఖ్య పాత్ర పోషించే ఎన్డీఎంఏ, ఎయిర్ పోర్ట్ అథారిటీ, ఎన్డీఆర్ఎఫ్, సివిల్ డిఫెన్స్, నేవీ, ఫైర్ సర్వీసెస్, పోలీసు, మెడికల్-హెల్త్ , పంచాయతీరాజ్ తదితర శాఖలు ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొంటాయన్నారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లో ఉంచిన పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్డీఎంఏ మెంబర్, లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అటా హస్నైన్, మేజర్ జనరల్ ఏకే వర్మ, విశాఖ ఎయిర్ పోర్టు అథారిటీ డైరెక్టర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఎన్డీఆర్ఎఫ్ ఎగ్జిబిషన్‌లో పనిముట్లు, సామగ్రిని పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారులు

స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ఉక్కు మంత్రి రాక రేపు

ఉక్కునగరం: కేంద్ర ఉక్కుశాఖామంత్రి హెచ్‌డీ కుమారస్వామి గురువారం స్టీల్‌ప్లాంట్‌కు రానున్నారు. ఆ రోజు ఉదయం తిరుపతి నుంచి విశాఖ వస్తారు. విశాఖలో సెయిల్, బీటీఎస్‌వో అధికారులతో సమావేశమవుతారు. అనంతరం స్టీల్‌ప్లాంట్‌కు చేరుకుని, వివిధ ఉత్పత్తి విభాగాలను సందర్శించనున్నారు. సాయంత్రం 4.30కు స్టీల్‌ప్లాంట్ నుంచి బయల్దేరి, ఢిల్లీకి పయనమవుతారని అధికార వర్గాల సమాచారం. అయితే ఈ పర్యటనలో స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు, అసోసియేషన్లతో సమావేశం పట్ల ఎలాంటి అధికారిక సమాచారం లేకపోవడం గమనార్హం.


ఖైదీల తరలింపు ప్రక్రియ ప్రారంభం

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలోని ఖైదీలను వేరే జైలుకు తరలించే ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ఇది వారం రోజులపాటు కొనసాగనుంది. ఇక్కడ సామర్థ్యానికి మించి ఖైదీలు ఉండటంతో పరిపాలన సౌలభ్యంలో భాగంగా 200 మందిని రాజమహేంద్రవరం జైలుకు తరలించాలని రాష్ట్ర జైళ్ల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా విశాఖ పోలీసుల ఎస్కార్టుతో మంగళవారం 20 మంది ఖైదీలను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి వ్యాన్‌లో తరలించినట్లు జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.సాయిప్రవీణ్ తెలిపారు.

ఫిబ్రవరి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు

- అత్యధికంగా 131 శాతం పెంపు
- ఆశీలమెట్టలో రూ.72 వేల నుంచి రూ.1.2 లక్షలు
- శివారు ప్రాంతాల్లోనూ భారీగా పెరగనున్న విలువలు
- రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం

మరో పిడుగు



విశాఖ సిటీ: మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను చేరిపేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. విశాఖలో స్థిరాస్తి రంగాన్ని దెబ్బతీసేందుకు సన్నద్ధమైంది. జిల్లాలో కనీవినీ ఎరుగని రీతిలో అశాస్త్రీయంగా భూముల విలువ సవరణ చేపడుతోంది. మునుపెన్నడూ లేని విధంగా అత్యధికంగా 70 శాతం వరకు రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఈ భూముల రిజిస్ట్రేషన్లపై వడ్డనకు ముహూర్తం ఖరారు చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రతి త్రైమాసికానికి రూ.150 కోట్ల మేర ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో కలిసి సిద్ధం చేసిన ప్రతిపాదనలకు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కూడా ఆమోదముద్ర వేశారు.

ఇష్టానుసారంగా పెంపు

కూటమి ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను నింపుకునేందుకు విశాఖనే ఆదాయ వనరుగా ఎంచుకుంది. దీంతో జిల్లాలో భూముల విలువలను అమాంతం పెంచేస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 70 శాతం వరకు భూముల విలువను సవరించింది. నగరంలో ఇప్పటికే భూముల విలువలు గరిష్ట స్థాయిలో ఉన్నాయి. అయినప్పటికీ మరోసారి 20 శాతం నుంచి పెంచుకుంటూ పోయారు. నగరంలో ఆశీలమెట్ట, రామ్‌నగర్, ఎంవీపీ కాలనీ, బీచ్ రోడ్, సీతమ్మధార, హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం, వెంకోజీపాలెం ప్రాంతాల్లో భారీగా పెరగనుంది. ఆశీలమెట్ట ప్రాంతంలో ప్రస్తుతం గజం రూ.72 వేలు ఉండగా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి రూ.1.2 లక్షలు కానుంది. అలాగే పాండురంగాపురంలో రూ.75 వేల నుంచి రూ.లక్ష, ఎంవీపీ కాలనీలో రూ.75 వేల నుంచి రూ.90, ప్రకాశరావుపేటలో రూ.67 వేల నుంచి రూ.80 వేలు, మురళీనగర్‌లో రూ.59 వేల నుంచి రూ.67 వేలు, గాజువాకలో రూ.22 వేల నుంచి రూ.32 వేలు వరకు పెరగనుంది.

శివార్లలోను భారీగా..

శివారు ప్రాంతాల్లో కూడా భారీగా భూముల విలువలు పెరగనున్నాయి. ప్రధాన జంక్షన్లు, వాణిజ్య ప్రాంతాల్లో మాదిరిగానే శివార్లలో కూడా కొన్ని చోట్ల 20 నుంచి 50 శాతం వరకు విలువను పెంచారు.

గోపాలపట్నం, వేపగుంట, ముడసర్లోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో భారీగా విలువ సవరించడంతో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ వాటిని ఏ మాత్రం పట్టించుకోలేదు. అలాగే మధురవాడ నుంచి భీమిలి వరకు, వేపగుంట నుంచి పెందుర్తి వరకు కూడా భారీగానే భూముల విలువ పెరగనున్నాయి. ఆనందపురం మండలం శిర్లపాలెంలో గజం భూమి ప్రభుత్వ ధర రూ.650గా ఉంది. మార్కెట్ విలువ రూ.2 వేలు కాగా.. దానిని ఇప్పుడు 131 శాతం పెంచి రూ.1,500 చేశారు. అలాగే బోని గ్రామంలో 58 శాతం, ముడసర్లోవలో 43 శాతం, గుడ్లవానిపాలెంలో 38 శాతం, పద్మనాభం మండలం అమనాంలో 33 శాతం , సాయి ప్రియా లేఅవుట్‌లో 26 శాతం ఇలా గ్రామాల్లో సైతం భూముల విలువలను భారీగా సవరించారు. అలాగే వ్యవసాయ భూముల ధరలు కూడా భారీగా పెరగనున్నాయి.

పద్మనాభం మండలం అమనాంలో ఎకరా భూమి రూ.45 లక్షలు కాగా 33 శాతం పెంచి రూ.60 లక్షలు చేశారు. చేపలుప్పాడలో ఎకరం రూ.1.3 కోట్లు కాగా.. 23 శాతం పెంచి రూ.1.6 కోట్లకు సవరించారు. దాకమర్రిలో ఎకరం రూ.1.2 కోట్లు ఉండగా, 23 శాతం పెంచి రూ.1.6 కోట్లు చేశారు.

స్థిరాస్తి రంగంపై ప్రభావం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించడంతో జిల్లాలో రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా పుంజుకుంది. ప్లాట్లు, ఫ్లాట్ల రేట్లు గణనీయంగా పెరిగాయి. దీంతో స్థిరాస్తి రంగం ఊపందుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కసారిగా రియల్ ఎస్టేట్ కుదేలైంది. ప్లాట్ల, ఫ్లాట్ల అమ్మకాలు పడిపోయాయి. ఇక కొత్త లేఅవుట్లు, ప్రాజెక్టులు ప్రారంభించేందుకు వ్యాపారులు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో భూముల విలువను భారీగా పెంచడంతో ఆ ప్రభావం రియల్ ఎస్టేట్ రంగంపై పడనుంది. కూటమి ప్రభుత్వ నిర్ణయం కోలుకోలేని దెబ్బగా స్థిరాస్తి వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

పెరగనున్న ఫ్లాట్ల ధరలు

ఒకవైపు ప్లాట్ల ధరలతో పాటు ఫ్లాట్ల విలువ కూడా గణనీయంగా పెరగనుంది. వీటి విలువలు కూడా 20 శాతానికి పైగా సవరించారు. బీచ్ రోడ్డులో రూ.5 వేలు నుంచి రూ.6 వేలు కానుంది. నగరంలోనే కాకుండా శివారు ప్రాంతాల్లో కూడా చదరపు అడుగు విలువను పెంచారు. గాజువాక, పెందుర్తి, ఎండాడ, మధురవాడ, పీఎంపాలెం, బక్కన్నపాలెం, మిథిలాపురం కాలనీ ప్రాంతాల్లో 5 నుంచి 15 శాతం వరకు పెరగనున్నాయి. ఈ ధరలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇప్పటికే ప్రకటించారు.

ఫ్లాట్ల ధరలు (చదరపు అడుగు)రూ.లలో

	ప్రస్తుతం	పెరిగిన
ఎంవీపీ కాలనీ	4,500	5,300
బీచ్ రోడ్డు	5,000	6,000
కిర్లంపూడి లేఅవుట్	5,000	6,000
మురళీనగర్	4,500	5,100
మర్రిపాలెం	4,400	4,400
మాధవధార	4,600	5,100
ప్రహ్లాదపురం	3,200	3,600
పీఎంపాలెం	4,000	4,200

భూముల ధరలు(చదరపు గజం) రూ.లలో

ఆశీలమెట్ట	72,000	1,20,000
ఆర్టీసీ కాంప్లెక్స్	1,05,000	1,12,000
అక్కయ్యపాలెం	70,000	76,000
పాండురంగాపురం	75,000	1,00,000
ఎంవీపీ	75,000	90,000
వీఐపీ రోడ్డు	75,000	90,000
ప్రకాశరావుపేట	67,000	80,000
మర్రిపాలెం	55,000	65,000
మురళీనగర్	59,000	67,000
మధురవాడ	45,000	55,000
బుచ్చిరాజుపాలెం	35,000	40,000
గాజువాక	22,000	32,000
పీలానగర్	16,000	22,000
రుషికొండ	25,000	30,000
అడవివరం	20,000	23,000
నాయుడుతోట	24,000	27,000
కాకానినగర్	40,000	45,000
పీఎంపాలెం	40,000	44,000
గుడ్లవానిపాలెం	24,000	33,000



నౌకల వద్ద విద్యార్థుల సందడి

నౌకల విశిష్టతను తెలుసుకుంటూ..










మత్స్య శికారిలో విద్యార్థులు

నౌకల్లో సందడే సందడి

భారత మత్స్య పరిశోధన సంస్థ (ఎఫ్ఎస్ఐ) ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్‌లో మంగళవారం నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఫిషింగ్ హార్బర్ జెట్టి నంబర్ 6 వద్ద పరిశోధన నౌకలు మత్స్య షికారి, మత్స్య దర్శినిని అధిక సంఖ్యలో విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని భారత మత్స్య పరిశోధన సంస్థ (ముంబై) డైరెక్టర్ జనరల్ డాక్టర్ కె.ఆర్.శ్రీనాథ్ ప్రారంభించి మత్స్యరంగంలో తీసుకుంటున్న ఆధునిక చర్యలను వివరించారు. ఈ నౌకల్లో సముద్ర జలాల్లో లభ్యమైన వివిధ రకాల చేపలతోపాటు అరుదైన మత్స్యరాశులు, నేవిగేషన్, కమ్యూనికేషన్, లైఫ్ సేవింగ్ ఫైర్ ఫైటింగ్, ఇతర పరికరాలు, మత్స్య సంపదకు దోహదపడే చేపల కృత్రిమ పరికరాలను ప్రదర్శించారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా కాలేజీ, డాక్టర్ బుల్లయ్య కాలేజీ, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల, ఏయూ, నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. భారత మత్స్య పరిశోధన సంస్థ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి నౌకల విశిష్టత, ఇతర అంశాలను విద్యార్థులకు వివరించారు. – మహారాణిపేట

బ్రిడ్జి కోర్సు శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశం కల్పించే బ్రిడ్జి కోర్సు శిక్షణ కోసం 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పాత ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. ఐటీఐలో 60 శాతం పైబడి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు.



అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్

- పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌కు 13 జిల్లాల క్రీడాకారులు
- అథ్లెటిక్స్‌తో పాటు ఆరు క్రీడాంశాల్లో పోటీలు



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పి.రఘువర్మ, ఇతర అతిథులు


నువ్వా...నేనా

విశాఖ స్పోర్ట్స్/ మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న 27వ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 720 మంది బాలురు, 510 మంది బాలికలు అథ్లెటిక్స్‌తో పాటు ఆరు క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, టీటీ, చదరంగంతో పాటు అథ్లెటిక్స్ ట్రాక్, ఫీల్డ్ అంశాల్లోనూ మూడు రోజుల పాటు జరిగే ఈపోటీల్లో 138 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌కు చెందిన విద్యార్థులు ప్రాంతీయ జట్లుగా తలపడనున్నారు. ఆయా జట్ల సభ్యుల నుంచి అతిథులు గౌరవ వందనాన్ని స్వీకరించారు. డిఫెండింగ్ చాంప్ కృష్ణా జట్టు నుంచి ఆతిథ్య జట్టు విశాఖతో సహా 13 రీజియన్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కృష్ణా జట్టుకు జయకుమార్, అనంతపురానికి మహేష్, చిత్తూరుకు గిరిబాబు, తూర్పుగోదావరికి చిరంజీవి, గుంటూరుకు దేముడు, కడపకు హేమంత్ రెడ్డి, కర్నూలుకు త్రిమూర్తి, నెల్లూరుకు తరుణి, ప్రకాశంకు నిఖిల్, శ్రీకాకుళానికి శివరామకృష్ణ, విజయనగరానికి లక్ష్మి, పశ్చిమగోదావరి జట్టుకు అవినాష్, విశాఖ జట్టుకు హేమంత్ కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించారు. క్రీడా జ్యోతి వెలిగించిన అనంతరం ఆయా జట్ల కెప్టెన్లు ప్రతిజ్ఞ చేశారు. అతిథులు శాంతికపోతాలను గాల్లోకి విడవగా ముఖ్య అతిథి మీట్ ప్రారంభాన్ని ప్రకటించారు. గేమ్స్ బాలుర వి భాగంలో అప్పర్‌పూల్‌లోని అనంతపురం రీజియన్‌తో కర్నూలు రీజియన్ జట్ల మధ్య వాలీబాల్ పోటీని, అథ్లెటిక్స్ ట్రాక్ ఈవెంట్‌లో భాగంగా బాలబాలికలకు 800 మీటర్ల పరుగును ప్రారంభించారు. అథ్లెటిక్స్‌లో బాలబాలికలకు స్ప్రింట్ అంశాలతో పాటు 800 మీటర్ల పరుగు, జంప్స్, త్రోస్ నిర్వహించనుండగా బాలురకు 1,500 మీటర్ల పరుగు, వంద, 400 మీటర్ల రిలే పరుగును నిర్వహించనున్నారు.

క్రీడలతో ఆరోగ్యం

క్రీడాపోటీలను పోటీలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. భారత్ శక్తి యువతేనని, సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత ముందుకు సాగాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన సాంకేతిక విద్య సంయుక్త సంచాలకుడు వి.పద్మారావు మాట్లాడుతూ ఏటా ఒక్కో రీజియన్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గతేడాది అనంతపురంలో నిర్వహిస్తే ఈసారి విశాఖలో నిర్వహిస్తున్నామని చెప్పారు. పోటీల్లో విజేతలు దక్షిణ భారతంలోని అంతర రాష్ట్ర పాలిటెక్నిక్ ఆటల పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. తొలుత విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ క్రీడలంటే గెలుపోటములే కాదని ఓటమిలోనూ పాఠం నేర్చుకోవడమే అన్నారు. కాకినాడ, తిరుపతి ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణ, నిర్మల కుమార్ ప్రియ, సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి జీవీ రామచంద్రరావు, డిప్యూటీ డైరెక్టర్ విజయ భాస్కర్, సాంకేతిక విద్యాశాఖ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంటు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, స్పోర్ట్స్ మీట్ సహ సమన్వయాధికారి డాక్టర్ బి.జానకీరామ్, వివిధ కాలేజీల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.


అనంతపురం ఆటగాడు బంతిని ప్రత్యర్థి కర్నూల్ కోర్ట్‌లో డ్రాప్ చేస్తున్న దృశ్యం

తొలిరోజు విజేతలు వీరే


లాంగ్ జంప్ విజేత యమున | షాట్‌పుట్ విజేత లక్ష్మి | లాంగ్ జంప్ విజేత శివ

లాంగ్ జంప్‌లో ప్రకాశం ఇంజినీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని మద్దుల యమున ప్రథమ స్థానంలో నిలవగా గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ నుంచి సుంకరి మల్లీశ్వరి ద్వితీయ స్థానం, కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజీ నుంచి మరియాల కౌశల్య తృతీయ స్థానంలో నిలిచారు. బాలికల షాట్‌పుట్ పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కాలేజీ నుంచి వి.లక్ష్మీ సాయి కృష్ణ తులసీ మొదటి స్థానంలోనూ, కృష్ణ జిల్లా గుడ్లవల్లూరు ఏఏఎంఎం అండ్ వీవీఎస్ ఆర్ పాలిటెక్నిక్ నుంచి కె.భారతి ద్వితీయం స్థానం, భీమునిపట్నం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజీ నుంచి ఎ.రక్షిత తృతీయ స్థానంలో నిలిచారు. పురుషుల లాంగ్ జంప్‌లో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ నుంచి కె.శివరామకృష్ణ ప్రథమ స్థానం, గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ నుంచి ఎస్.ఈశ్వరవర్ధన్ ద్వితీయ స్థానం, పాడేరు ప్రభుత్వ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ నుంచి కె.ప్రశాంత్ కుమార్ తృతీయ స్థానంలో నిలిచినట్లు కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు.

అప్పన్న ఆలయ పైకప్పు పనులకు గ్రీన్ సిగ్నల్

- సిమెంట్ లేకుండా కరక్కాయ, తేనె, మూలికల వినియోగం
- ఉచితంగా పనులు చేసేందుకు ముందుకొచ్చిన వేంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్
- తొమ్మిది నెలల్లో పనుల పూర్తి


అప్పన్న ఆలయం

సింహాచలం: శతాబ్దాల చరిత్ర కలిగిన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ పైకప్పులో ఏర్పడిన లీకేజీలను పూడ్చేపనులు వచ్చే నెలలో ప్రారంభం కానున్నాయి. మహారాష్ట్రలోని పూణేకు చెందిన లార్డ్ వేంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్ట్ ఈ పనులను ఉచితంగా చేసేందుకు ముందుకు వచ్చింది. పురాతన ఆలయాల మరమ్మతులకు అనుసరించే విధానాలతో పనులు చేపట్టనుంది. ఈమేరకు దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ జి.వి.ఆర్.శేఖర్ ఈనెల 23వ తేదీన అనుమతులు జారీ చేశారు. వివరాలిలోకి వెళ్తే.. రాష్ట్రంలోనే ప్రధాన దేవాలయాల్లో ఒకటిగా ఉన్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయం శతాబ్దాల నిర్మించారు. రానురాను ఆలయం పైభాగంలో రంధ్రాలు ఏర్పడి వర్షం నీరు లోపలకి చేరుతోంది. ముఖ్యంగా ప్రధాన ఆలయంతో పాటు కల్యాణ మండపంలో, వంటశాలలో నీరు చేరుతోంది. సుమారు ఇరవై ఐదేళ్ల క్రితం అప్పటి ఈవో వి. శంకరరెడ్డి శాండ్ బ్లాస్టింగ్ పనులు చేయించి కొంత మేర లీకేజీలను సరిదిద్దారు. కానీ ఆ పనులు ద్వారా పూర్తిస్థాయిలో ఆశించినంత ఫలితాలు రాకపోవడంతో మళ్లీ పరిస్థితి యథాస్థితికి వచ్చింది. 2009లో అప్పటి ఈవో సి.ప్రేమ్‌కుమార్ హయాంలో ఫోర్స్ రాక్ సిస్టం పద్ధతిలో ప్రత్యేక మెటరియల్‌ను రంధ్రాలు ద్వారా పంపి ఆలయ బేడామండపం తదితర ప్రదేశాల్లో లీకేజీలను సరిదిద్దారు. ఆ విధానంతో కొన్నేళ్ల పాటు లీకేజీలు తగ్గుముఖం పట్టాయి. కానీ ఇటీవల కొన్నిచోట్ల మళ్లీ వర్షం నీరు లోపలకి వచ్చి చేరుతోంది. ముఖ్యంగా ప్రధాన ఆలయం, కల్యాణమండపం, వంటశాలలో వర్షం నీరు లోపలికి వస్తోంది. దీంతో రాష్ట్ర దేవదాయశాఖ, సింహాచలం దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు ఈ విషయంపై పూణేకు చెందిన లార్డ్ వేంటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్టును సంప్రదించారు. ఆ ట్రస్ట్ ఇప్పటికే శ్రీకాళహస్తి, శ్రీశైలం దేవస్థానాల్లో మరమ్మతు పనులు చేసింది. దాంతో ఆ సంస్థ ప్రతినిధులు వేంకటేశ్వరరావు, జమీల్ గత ఏడాది నవంబరులో సింహాచలం వచ్చి ఆలయ పైకప్పు, ఇతర ప్రదేశాలను పరిశీలించారు. పురాతన ఆలయాల మరమ్మతులకు అనుసరించే పద్ధతులతో మరమ్మతులు చేయాలని వారంతా భావించారు. అలాగే శాస్త్రపరంగా కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కెమికల్ ట్రీట్‌మెంట్ ద్వారా పనులు పూర్తిచేయడానికి సంసిద్ధమయ్యారు. సిమెంట్‌తో సంబంధం లేకుండా కరక్కాయ, తేనె కొన్ని మూలికలు మాత్రమే ఉపయోగించి పనులు పూర్తి చేసేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రధాన ఆలయంతో పాటు వంటశాల, కల్యాణ మండపంలో కెమికల్ ట్రీట్‌మెంట్ పనులు చేయనున్నారు. కాగా ఆలయ చరిత్ర, శిల్పశాస్త్రానికి ఎలాంటి విఘాతం కలగకుండా పనులు చేయాలని దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, దేవదాయశాఖ స్థపతులు, ఆలయ వైదిక వర్గాల సూచనలు స్పష్టంగా పాటించాలని, తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో చీఫ్ ఇంజినీర్ ఆదేశించారు.



మేజర్ పోర్ట్స్ క్యారమ్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న వీపీఏ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే

విశాఖ స్పోర్ట్స్: విశాఖ పోర్ట్ అథారిటీ(వీపీఏ) ఆధ్వర్యంలో ఆల్ ఇండియా మేజర్ పోర్ట్స్ క్యారమ్ చాంపియన్‌షిప్ మంగళవారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో ముంబై, దీన్‌దయాళ్, కోల్‌కతా, చెన్నై, పారాదీప్, జెఎన్, న్యూమంగళూర్, కామరాజార్, ఆతిథ్య విశాఖ పోర్టుతో సహా తొమ్మిది మేజర్ పోర్టు జట్లు పోటీపడనున్నాయి. పోర్ట్ ఇండోర్ స్టేడియంలో వీపీఏ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే పోటీలను విడిచి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖకు చెందిన అంతర్జాతీయ ఆటగాడు జనార్దన్ రెడ్డితో కాసేపు క్యారమ్ ఆడారు. కార్యక్రమంలో పోర్ట్ విభాగాధిపతులు, అధికారులు, తొమ్మిది మేజర్ పోర్ట్‌లకు చెందిన ఆటగాళ్లు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి చెబుదాం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ

డాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణకు నగరవాసులు సహకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ పిలుపునిచ్చారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్తంగా సుస్థిర నీటి నిర్వహణ, ప్లాస్టిక్, ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ..పర్యావరణ పరిరక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి చెప్పి, ప్రత్యామ్నాయాలు వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా, జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు అందించేలా ప్రజలు క్రమశిక్షణతో మెలగాలన్నారు. వేడివేడి ఆహార పదార్థాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళ్లడం ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులు, సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యుల పరిశోధనలో తేలిందన్నారు. నీటి నిర్వహణపై మాట్లాడుతూ ఇంకుడు గుంతలు తవ్వి వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలు సంరక్షించాలని సూచించారు. మురుగునీటితో సముద్ర జలాలు కలుషితంకాకుండా ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠ్యాంశాల్లో వీటి ప్రాముఖ్యత ప్రచురించేలా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. పర్యావరణ పరిరక్షణపై పలు చట్టాలను ఆమె క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో జేసీ శ్రీరామ్మూర్తి, విశ్రాంత ప్రొఫెసర్లు ఎస్.రామకృష్ణారావు, ఇ.ఉదయ భాస్కర్‌రెడ్డి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

జైల్లో కొత్త బ్యాచ్‌లకు చేతి వృత్తుల్లో శిక్షణ

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు వివిధ చేతి వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25న రెండు వృత్తుల్లో శిక్షణ పొందిన బ్యాచ్‌లకు పరీక్షలు జరిగాయి. మరో రెండు, మూడు రోజుల్లో కొత్త బ్యాచ్‌లు ప్రారంభంకానున్నట్లు జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.సాయి ప్రవీణ్ తెలిపారు. ఇక్కడ ప్లంబింగ్, వెల్డింగ్ కోర్సుల్లో 40 మంది చొప్పున రిమాండ్ ఖైదీలకు రెండు నెలలు పాటు శిక్షణ అందించామన్నారు. శిక్షణ పొంది, పరీక్షలు రాసిన వారికి సర్టిఫికెట్లు కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆ సర్టిఫికెట్లు బాహ్య ప్రపంచంలో వారికి చేతి వృత్తుల్లో ఉపయోగపడతాయన్నారు. రెండు మూడు రోజుల్లో ప్రారంభం కానున్న కొత్త బ్యాచ్‌లలో 45 మంది చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

స్వీయ రక్షణ సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుకునే విద్యార్థినులకు కరాటే, తైక్వాండో వంటి స్వీయరక్షణ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం అర్హత గల శిక్షణ సంస్థలు ఈ నెల 30 సాయంత్రం 5 గంటల్లోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాల్సిందిగా కోరారు.



CHANGE OF NAME
I, **DAVALA AJAY KUMAR,** Son of Army No : **JC284606W,** Rank: **SUB (DMT),** Name: **CHANDRAYYA DAVALA** residing at Gangadharapeta (V), Polavaram (PO), Tekkali (M), Srikakulam District, Andhra Pradesh-532201 have Changed my name from **DAYALA AJAYA KUMAR** to **DAVALA AJAY KUMAR** and my correct Date of Birth is **19-11-2004**.Vide affidavit dated 27-01-2025 sworn before notary at Tekkali.

PASSPORT MISSING
I am **ABDUL RAMEEZ** S/o. Abdul Razak, Resident of D.No. MIG-35, VUDA Phase-5, Kurmannapalem, Vadlapudi post, Gajuwaka Visakhapatnam - 530046. have lost my Passport No. **N4649338,** while I was travelling by bike from Kurmannapalem to Gajuwaka on Dt. 8-1-2025 if any one found it Please Contact : **97017 08767**

DOCUMENT MISSING
I, **Sanapala Ravi Kiran** (S/o Sanapala Nagesh), Resident 39-24-19/1, Madhavadhara, Narsimha nagar, Visakhapatnam. I have lost my original SSC 10th class certificate while I was travelling from RTC Complex to Madhavadhara (Hall ticket No / Roll No:1438115345), If anyone found please contact me
Cell: 77994 48449.

Services

BUSINESS OFFER
■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6200]

■ చెదలు, బొద్దింకలు సమస్యలా ? పేస్ట్‌క్యూర్ సొల్యూషన్స్, సంప్రదించండి: ఫోన్ : 9505914870 [HA-39805]

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

Wanted
■ కేర్‌టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో పేషెంట్లను ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు ప్రముఖ హోమ్‌కేర్ సంస్థకు కావలెను. మంచి జీతం+వ+ భో ✆ 91608 35559, 78158 35561 [B-431]

■ ప్రముఖ వ్యాపార సంస్థ యందు Managers పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. Retd., ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగస్తులు, Housewives కు ప్రాధాన్యత. Salary + Incentive ఇవ్వబడును. ఫోన్ : 94417 90382, 77023 85900 [V- 643]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషేంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతిఫుడ్ జీ:20k ఫోన్: 8977639662, 8977639663 [SCA25001369]

■ రాయపూర్ (ఛత్తీస్‌గఢ్) ఊరులో క్లౌడ్ కిచెన్‌లో తెలుగు వెజ్ వంటలు చేయడానికి ఒక అనుభవశాలియైన కుక్ కావాలి. జీతము వంట నైపుణ్యాలు బట్టి. సంప్రదించండి - 9425203443 [HA-7843]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

'తండేల్ కలెక్షన్లు దుల్లగొట్టేయాలి'


మాట్లాడుతున్న హీరో నాగచైతన్య, నిర్మాత అల్లు అరవింద్

సీతంపేట: విశాఖలో తండేల్ చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్రం ట్రైలర్‌ను రామా థియేటర్‌లో హీరో నాగచైతన్య, చిత్ర సమర్పకుడు, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, దర్శకుడు చందూ మొండేటి లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ విశాఖ హార్బర్ పరిసరాల్లో చిత్ర షూటింగ్ జరిగిందని, విశాఖలో ట్రైలర్ లాంచ్ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ఏ సినిమా అయినా విశాఖలో టాక్‌బట్టే భవితవ్యం తేలిపోతుందన్నారు. విశాఖ అమ్మాయినే ప్రేమించి పెళ్లి చేసుకున్నా..తండేల్ సినిమా కలెక్షన్లు దుల్లగొట్టేయాలి అంటూ అభిమానులద్దేశించి అన్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు చార్ట్ బస్టర్‌గా నిలిచాయని, దేవిశ్రీ అద్భుత బాణీలు అందించాడన్నారు. ఏడాదిన్నరగా తాను కూడా చైతూ జపం చేస్తున్నానని అల్లు అరవింద్ అన్నారు. చాలా కష్టపడి సినిమా తీశాం. ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సత్య, డిజిటల్ పార్టనర్ మార్నింగ్ షో బృందం, అక్కినేని అభిమానులు, రామా టాకీస్ మేనేజర్ ఉమామహేశ్వర రావు పాల్గొన్నారు.

కేజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సుగీత స్వర్ణలత


స్వర్ణలతకు నియామకం ఉత్తర్వులు అందజేస్తున్న రాధారాణి

మహారాణిపేట: కేజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా సుగీత స్వర్ణలత నియామకంపై విమర్శలు వస్తున్నాయి. ఎప్పుడో జిల్లా పదోన్నతి కమిటీ (డీపీసీ) ద్వారా పదోన్నతి పొందిన స్వర్ణలతను ఇప్పుడు కేజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టును శ్రీకాకుళం జిల్లాలో రిమ్స్‌లో పనిచేస్తున్న హెడ్ నర్సు లక్ష్మీరాజ్యం ఆశించారు. ఇదిలావుండగా లక్ష్మీరాజ్యం క్యాన్సర్ రోగిగా చికిత్స పొందుతున్నారు. పదోన్నతుల్లో తనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె వైద్య ఆరోగ్యశాఖాధికారులను కోరారు. అయితే గత డీపీసీ నిర్ణయం కారణంగానే స్వర్ణలతను నియమించామని రాధారాణి స్పష్టం చేశారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


ప్రయాణికుడికి పోగొట్టుకున్న డబ్బును అందజేస్తున్న ఆటోడ్రైవర్, ఆర్టీసీ సిబ్బంది

డాబాగార్డెన్స్: నేలపై రూ.10 కనిపిస్తే చాలు తక్కున తీసుకుని జేబులో పెట్టుకునే మనుషులున్న ఈ రోజుల్లో నిజాయితీ చాటుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. పాలకొండ నుంచి విశాఖకు డి.శ్రీనివాసరావు మంగళవారం ఉదయం 10.45 గంటలకు ద్వారకాబస్టేషన్‌లో ఆర్టీసీ బస్సు దిగాడు. బస్సు దిగే క్రమంలో అతని జేబులో నుంచి రూ.9,500 పడిపోయాయి. కంగారులో ఆ ప్రయాణికుడు వెళ్లిపోయాడు. ద్వారకాబస్టేషన్ వద్ద సర్వీస్ చేస్తున్న గొంప సూరిబాబు (ఆటో నంబరు ఏపీ39టీడీ 4234)అనే ఆటో డ్రైవర్‌కు ఆ డబ్బులు దొరికాయి. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న స్టేషన్ మేనేజర్ జీవీ రమేష్, ఏఎస్సై బీఎస్ నారాయణ, ఆర్‌డీ వి.ప్రసాద్‌కు డబ్బులు అందజేశాడు. ఇంతలో ప్రయాణికుడు శ్రీనివాసరావు డబ్బులు పడిపోయాయంటూ..స్టేషన్ మేనేజర్‌ను కలిశాడు. వివరాలు మొత్తం తెలుసుకుని ఆ డబ్బులు అందజేశారు. ఆటో డ్రైవర్ నిజాయితీని ఇటు ద్వారకాబస్టేషన్ సిబ్బంది..ఆర్టీసీ ప్రయాణికుడు అభినందించారు.

ఉక్కుకు సొంతగనులు కేటాయించకుండా నాటకాలు

సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు


ఉద్యమ జ్యోతితో సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు, ఉద్యమ నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నప్పటికీ సొంత గనులు కేటాయించకుండా వాటి ప్రాధాన్యతను తగ్గిస్తూ మాట దాట వేస్తున్నాయని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు ఆరోపించారు. విశాఖ ఉక్కు రిలే దీక్షా శిబిరం నుంచి ఉద్యమ జ్యోతిని సీపీఎం రాష్ట్ర మహాసభల్లో ప్రదర్శనకు తీసుకువెళ్లే కార్యక్రమం కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ప్రారంభం కాని ప్రైవేటు ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని ప్రధాన మంత్రిని కోరుతున్న ముఖ్యమంత్రి లక్షల మందికి ఉపాధి కల్పించి, రాష్ట్రానికి మణిపూసగా ఉన్న విశాఖ ఉక్కు విషయంలో ఎందుకు నిర్లక్ష్య ధోరణి కనబర్చుతున్నారని ప్రశ్నించారు. ప్యాకేజీ పేరుతో పక్కదోవ పట్టించి ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనిని గమనించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం అనేక ఉద్యమాలు జరిగాయని, వాటిని కాపాడుకోడానికి కూడా సంఘటిత ఉద్యమాలు చేయాల్సి వస్తుండడం దారుణమన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, నాయకులు మణి, పి.శ్రీనివాసరాజు, కేవీ శ్రీనివాస్, స్టీల్ సిటూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, వై.టి.దాస్, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, రమణ మూర్తి, డొమ్మేటి అప్పారావు, సీహెచ్.సన్యాసిరావు, వరసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..లేదంటే ఆత్మహత్యకు అనుమతివ్వండి

ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్‌కు బాధితుడు రామారావు లేఖ

అగనంపూడి: న్యాయం చేయండి.. లేకపోతే భార్యతో కలిసి ఆత్మహత్య చేసుకోవడానికై నా అనుమతి ఇవ్వండి అని విశాఖ ఉక్కు మాజీ కాంట్రాక్ట్ కార్మికుడు ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్‌కు లేక రాయడం సంచలనంగా మారింది. 28 ఏళ్ల పాటు విశాఖ ఉక్కు యాజమాన్యం తనతో వెట్టి చాకిరీ చేయించుకుని నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగించిందని శరగడం రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. తనతో పాటు పనిచేసి కార్మికులందర్నీ పర్మినెంట్ చేయగా..వారంతా నెలకు రూ.లక్షన్నర జీతం పొందుతున్నారని, తనకు న్యాయం చేయమని అడిగినందుకు విధుల నుంచి తప్పించారని ఆరోపించారు. కనీసం పింఛన్ సౌకర్యం కల్పించలేదని, ఇదే విషయమై పలుమార్లు ఉక్కు యాజమాన్యాన్ని, ఈపీఎఫ్ విభాగానికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశాడు. రోజుకు కేవలం రూ.149కే విశాఖ ఉక్కు యాజమాన్యం తనతో వెట్టి చాకిరీ చేయించుకుందని, పీఎఫ్ కూడా చెల్లించకుండా అన్యాయానికి గురిచేసిందన్నారు. ఇదే విషయమై తనతోపాటు సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు పలు లేఖలు రాసినా ప్రయోజనం లేకుండా పోయిందని, ఈ పరిస్థితుల్లో తనకు న్యాయం జరగదని భావిస్తున్నాని రామారావు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో బతికేకన్నా..కనీసం మా మృతితో అయినా స్టీల్‌ప్లాంట్, ఈపీఎఫ్ అధికారుల్లో కనువిప్పు కలుగుతుందనుకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆత్మహత్య చేసుకోడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా అనుమతి ఇప్పించాలని కోరుతున్నామని ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు.

ఆర్టీసీ అధికారులకు అభినందనలు


ఆర్టీసీ అధికారి అప్పలనాయుడుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

డాబాగార్డెన్స్: గత నెలలో అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్ అథ్లెటిక్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించిన ఏపీఎస్ ఆర్టీసీ అధికారులను రాష్ట్ర డీజీపీ, ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు మంగళవారం అభినందించారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటిస్తున్న ఆయన జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయ్‌కుమార్, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణతో పాటు పలువురు అధికారులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం తిరుమలరావు మాట్లాడుతూ విశాఖ నగరం పర్యాటక విభాగంలో మరింతగా అభివృద్ధి చెందాలని, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆర్టీసీ సర్వీసులు నడిపి ప్రమన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

చిట్టీల నిర్వాహకుడు అరెస్ట్

- గతంలో రూ.80 లక్షలతో పరారీ
- బాధితులు పోలీసులు

అల్లిపురం: చిట్టీ గ్రూపులు నిర్వహిస్తూ సుమారు రూ.80 లక్షలతో పరారైన వ్యక్తిని టూటౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బి.భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కోసన ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి 2019లో శ్రీ వెంకటేశ్వర ఫ్రూట్స్ అండ్ జ్యూస్ షాపును నగర పోలీస్ కమిషనరేట్ ఎదురుగా నిర్వహించేవాడు. అక్కడికి వచ్చే ఏఆర్, సివిల్ పోలీస్ సిబ్బందితో పరిచయాలు పెంచుకొని ఎటువంటి అనుమతులు లేకుండా కేవలం వాట్సాప్ గ్రూపుల ద్వారా చిట్టీలు నిర్వహించాడు. ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్ల నుంచి చిట్టీలతో పాటు వరలక్ష్మి, దసరా, క్రిస్మస్, సంక్రాంతి చిట్టీల పేరుతో సంఘాలు నడిపేవాడు. రెండేళ్ల క్రితం కుటుంబంతో సహా విజయవాడ పరారయ్యాడు. ఏఆర్ కానిస్టేబుల్ జి.మాకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై చీటింగ్, చిట్ ఫండ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితుడు మంగళవారం నగరంలో తాను నివసించిన ఇంటి వద్దకు వచ్చాడు. సమాచారం మేరకు సీఐ భాస్కరరావు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

జైల్లో విచారణ కమిటీ

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారాన్ని మంగవారం ఇద్దరు సభ్యుల గల విచారణ కమిటీ సందర్శించింది. గత నెలలో జైల్లోకి భోజనం క్యారేజీలో గంజాయి తీసుకువెళ్తూ ఆస్పత్రి ఫార్మసిస్ట్ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ వ్యవహారంలో అప్పట్లో ఇక్కడ పనిచేసిన జైల్ సూపరింటెండెంట్, అడిషనల్ సూపరింటెండెంట్లను రాష్ట్ర జైళ్ల శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఇద్దరు సభ్యులతో కూడిన విచారణ కమిటీని నియమించారు. ఆ కమిటీ మంగళవారం కేంద్ర కారాగారానికి చేరుకొని విచారణ చేపట్టింది. ఈ విచారణలో సస్పెన్షన్‌కు గురైన ఆ ఇద్దరు జైల్ అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు నిర్ధారణ అయినట్లు విశ్వసనీయ సమాచారం. దీన్ని బట్టి ఆయా అధికారుల సస్పెన్షన్ కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలిసింది.